రాయలసీమ హాస్య కథలు



సంపాదకత్వం : డా. ఎం. హరికిషన్

దీప్తి

రాయలసీమ హాస్య కథలు

సంపాదకత్వం

డా॥ ఎం. హరికిషన్

94410 32212

దీప్తి ప్రచురణలు

మ్యూజియం రోడ్డు, విజయవాడ - 520 002



Rayalaseema
Hasya Kathalu

Edited by:
Dr.M.Hari Kishan
45/205-1,
Teachers Colony,
Kurnool.
Cell: 94410 32212

First Print : June2022

Price : Rs. 280/-

Cover : Dundrapelli Babu

Design : T. Saibaba

Printers: SVR Offset Printers
Vijayawada - 11

Publishers:
Deepthi Prachuranalu,
27-20-46, Museum Road,
Governerpet,
Vijayawada-520 002
Phone: 0866 2576864
Cell: 98490 65280

కథల వరుస

✳ కృతజ్ఞతలు ✳

రాయలసీమ రచయితల వస్తు వైవిధ్యాన్ని సాహితీ ప్రేమికులకు అందించడం కోసం నేను చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఈ హాస్యకథల సంకలనం. ఈ పని మొదలు పెట్టాక నాకు అర్థమయిన విషయం ఏమిటంటే హాస్య కథలు వెదకడం అంత సులభం కాదని. రాయలసీమలోనే కాదు తెలుగు నేల మొత్తంలో గూడా హాస్య రచయితలను వేళ్ళమీద లెక్కబెట్టవచ్చు. హాస్య రచనలుగా పేర్కొనే చాలా వాటిని చదివినప్పుడు నవ్వు పెదవిగూడా దాటదు. రాయలసీమ రచయితల ప్రధాన దృష్టి సామాజిక చిత్రణే అయినప్పటికీ ఒకటి రెండు కథలు కొన్ని కలాల నుంచి అప్పుడప్పుడు వెలువడ్డాయి. అటువంటి వాటిలోంచి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే 44 కథల్ని ఏరి మీ ముందుకు తెస్తున్నాను. ఇందులో పగలబడి నవ్వించేవి, చిరునవ్వులు తెప్పించేవి ఎన్నున్నాయో పాఠకులే తేల్చాలి. ఈ పుస్తకం సమగ్ర సంకలనమేమీ కాదు. వివిధ దశల్లో వచ్చిన, నాకు నచ్చిన కొన్ని కథల్ని మాత్రమే ఈ సంకలనంలోకి తీసుకున్నాను. కొన్ని కథలు నా దృష్టికి వచ్చినా రచయితల నుంచి సకాలంలో అందకపోవడం చేత ప్రచురించలేక పోయాను.

సంకలనం ప్రారంభించిన వెంటనే ఇరవై వేల రూపాయల పుస్తకాలు కొనుగోలు చేయడానికి అడగకుండానే ముందుకు వచ్చిన మిత్రుడు పరదేశి ప్రభాకర్ గారికి...

ఈ సంకలనం రూపుదిద్దుకోవడంలో, కథలు ఎన్నుకోవడంలో ఎంతగానో సహకరించి ఆలస్యం చేయకుండా కథల్ని అందించిన రాయలసీమ రచయితలు, రచయిత్రులకు...

కథల సేకరణలో నిరంతరం తోడ్పడే మిత్రులు బంగారు రామాచారి గారికి...

రాయలసీమ రచయితల్లో హాస్యం అనగానే ప్రధానంగా గుర్తుకు వచ్చే చిలుకూరి దేవపుత్ర, జి.ఆర్.మహర్షి, ఎ.జయలక్ష్మి రాజు, వియోగి, తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం, ఎస్.వి.ప్రసాద్ గార్లకు,

నా ప్రయత్నానికి అండగా నిలబడడమే గాక, పుస్తకంలోని అచ్చుతప్పులు చాలా వరకు తగ్గించిన నా శ్రీమతి డా.కె.చంద్ర మౌళిని గారికి...

కవర్ డిజైన్ చేసిన చిత్రకారుడు దుంద్రపెల్లి బాబు గారికి...

నా మాట మీద నమ్మకంతో ఈ సంకలనం ప్రచురించడానికి ముందుకు వచ్చి, తోడుగా నిలబడిన దీప్తి ప్రచురణల వారికి

- డా॥ ఎం. హరికిషన్

అతిథి దేవోభవ...

ఆదోని బాష – 94402 39828

"డాడీ అతిథి దేవో భవ అంటే ఏమిటి?" సాయంత్రం ఇంటికి రాగానే రాంబాబుకి అతని ఆరేళ్ళకొడుకు చంటి వేసిన ప్రశ్న ఇది. అతిథి పేరు వింటేనే మండిపడే రాంబాబుకి కొడుకు ప్రశ్న విని చిర్రెత్తుకొచ్చింది.

"వెధవా.... ఆ మాత్రం తెలీదా? అతిథి దేవో భవ అంటే అతిథి దెయ్యంలా భయపెడతాడని అర్థం" కసిగా చెప్పి విసురుగా సోఫాలో కూర్చున్నాడు.

అతని వేగానికి సోఫా కుయ్యో మొర్రో అంటూ టకటకమని చప్పుడు చేసింది.

వంటింట్లో ఉన్న లత భర్త మాటలు విని హాల్లోకొచ్చింది.

"అదేంటండీ, ఎవరి మీది కోపమో వాడి మీద చూపిస్తున్నారు. ఆఫీసులో బాసుతో గొడవపడి వచ్చారా?" అనడిగింది.

"గొడవపడింది బాసుతో కాదు, బాసుగారి బాసుతో"

"బాసుగారి బాసా, అదెవరు?"

"ఇంకెవరు, మన బాసుగారి భార్యామణి"

"ఆవిడ మీ ఆఫీసుకెందుకొచ్చింది?

"బుద్ధి గడ్డి తిని మేమే పిలిచాం"

"ఎందుకు?"

మా కంపెనీ చాక్లెట్ల సేల్స్ పెంచటానికి మేం అప్పుడప్పుడు కస్టమర్లతో చిన్న చిన్న మీటింగులు ఏర్పాటు చేస్తుంటామని మీకు తెలుసు కదా. ఈ రోజు అలాంటిదే ఓ మీటింగ్ జరిగింది. దానికి ముఖ్య అతిథిగా మా బాసుగారి భార్యని ఆహ్వానించాం. ఈ రకంగా బాసుని ప్రసన్నం చేసుకోవాలనుకున్నాం.

ఆయన భార్య బిస్కెట్ కంపెనీకి సేల్స్ అడ్వయిజర్‌గా వ్యవహరిస్తోంది. ఏవో నాలుగు ఉచిత సలహాలిచ్చి మా బ్రాంచిని ప్రోత్సహిస్తుందనుకుంటే ఆవిడ మా స్టాఫ్‌ని లక్స్ సబ్బుతో కడిగేసింది. నన్నయితే ఓ బిస్కెట్ లా కరకర నమిలి తినేసింది"

"ఇంతకీ ఆవిడ ఏం చెప్పింది?"

"చాలా చెప్పింది. హిమాలయాల్లో ఐస్‌క్రీముని అమ్మాలంది. థార్ ఎడారిలో ఇసుక వ్యాపారం చెయ్యాలని చెప్పింది. బంగాళాఖాతంలో ఉప్పుని అమ్మాలని సెలవిచ్చింది. ఇవన్నీ చెయ్యగలిగినవాడే నిజమైన సేల్స్‌మెన్ అని శ్రీకృష్ణుడిలా గీతోపదేశం చేసింది"

"ఇందులో కొత్త విషయమేముంది? ఇవన్నీ గొప్ప ఆర్థికవేత్తలు చెప్పిన పాయింట్లే కదా?"

"అదేమాట నేను నోరు జారి అనేశాను. అంతే! ఆవిడ అహం దెబ్బ తింది. మొహం జేవురించింది. దాంతో నాపై విరుచుకుపడింది. ఒక సేల్స్ మెన్‌గా నేనింకా ఎదగాల్సి ఉందని చెప్పింది. నాకు నా కంపెనీ ప్రోడక్టుని అమ్మే కళ తెలియదట. ఒకవేళ నేను తన దగ్గరికొచ్చి నా కంపెనీ చాక్లెట్లు అమ్మబోతే ఆవిడ వాటిని కొనకుండా తన కంపెనీ బిస్కెట్లనే నాచేత కొనిపిస్తుందట. అలా అందరి ముందు నన్ను ఎగతాళి చేసింది"

"మీరు ఇంత చిన్న విషయానికే ఫీలవుతున్నారా?"

"ఇది చిన్న విషయం కాదు. ఆవిడ కంపెనీ తయారు చేసేవి కుక్క బిస్కెట్లు"

"అంటే ఆవిడ మిమ్మల్ని కుక్కతో పోల్చిందన్న మాట. అయినా మీరు ఆవిడ మాటలు విని తోక ఊపుతూ నిల్చున్నారా ఏంటి?"

"ఊరకే నిల్చోక ఆవిడ్ని కరవాలంటావా?"

"కరచి వుంటే ఆవిడ తిక్క కుదిరేది"

"అంటే నీక్కూడా నేను కుక్కలా కన్పిస్తున్నానా"

"కరవటమంటే కుక్కలా నోటితో కరవటం కాదు, మాటలతో కరవాలి"

"అదెలాగో నువ్వే కరచి చూపించు"

"నేనే మీ స్థానంలో వుంటే ఆవిడ్ని కరచినట్టు ఘాటుగా జవాబు చెప్పేదాన్ని. మేడమ్, మా కంపెనీ చాక్లెట్ల ఫేవర్ ఎంత బావుంటుందంటే వాటి ఫ్లేవర్ ని మీ బిస్కెట్లపై పూస్తే చాలు, అవి కుక్క బిస్కెట్లని కూడా చూడకుండా మీరు గబుక్కున తినేస్తారు అనేదాన్ని. దాంతో ఆవిడ తిక్క కుదిరేది. మరో మాట మాట్లాడకుండా నోరు మూసుకునేది."

"నీకింత బుర్ర ఉందని నా బుర్రకి తట్టనే లేదు సుమా... లేకపోతే నీ సలహా తీసుకునేవాడిని"

"అలా తట్టాలంటే కాస్తయినా బుర్ర ఉండాలి"

"అంటే నాకు బొత్తిగా బుర్ర లేదంటావా? ఇదిగో మిసెస్ రాంబాబు, నీ మొగుణ్ని అంత తక్కువగా అంచనా వెయ్యకు. సమయం రానీ, నా బుర్ర ఎంత గట్టిదో నిరూపిస్తా" బల్ల గుద్ది చెప్పాలనుకొని అక్కడ బల్ల లేకపోవటంతో టీపాయ్ గుద్దుతూ ఆవేశంగా అరచి అన్నాడు రాంబాబు.

"అబ్బబ్బ... మీ గొడవలో పడి నా సంగతే మర్చిపోయారు. ఇంతకీ అతిథి దేవోభవ అంటే ఏమిటో సరిగా చెప్పండి. మా స్కూల్లో చెప్పాలి" అని చంటి అసహనంగా అన్నాడు.

"మీ డాడీకి అతిథులంటే ఎలర్జీరా, అందుకే అతిథిని దెయ్యంతో పోల్చారు. నిజానికి అతిథి దేవో భవ అంటే అతిథి దేవుడితో సమానమని అర్థం" అంటూ కొడుక్కి విడమర్చి చెప్పిన లత అంతలోనే ఏదో గుర్తొచ్చి ఉలిక్కిపడింది.

"అతిథి అంటే గుర్తొచ్చింది. ఇంకో గంటలో మనింటికి అతిథులొస్తున్నారు" అంది.

ఆ మాట వినగానే రాంబాబు సోఫాలో ఇంతెత్తున ఎగిరిపడ్డాడు.

సోఫా మరోసారి కుయ్యో మొర్రో అని చప్పుడు చేసింది.

"చావుకబురు చల్లగా చెబుతున్నావు. ఇంతకీ మనింటికి ఎవరొస్తున్నారు?" ఆత్రంగా అడిగాడు.

"మా అమ్మానాన్న, చెల్లి వస్తున్నారు..."

"ఓరినాయనోయ్! తుఫాను, సునామీ, భూకంపం కలసికట్టుగా వస్తున్నాయా? మమ్మల్ని ఇక ఆ దేవుడే కాపాడాలి" అన్నాడు రాంబాబు.

"ఛీ... ఛీ... మా వాళ్ళని ప్రకృతి విపత్తులతో పోలుస్తారా?" మూతి మూడు వంకర్లు తిప్పుతూ అంది లత.

"అలాగా, ఐతే మీ వాళ్ళను డైనోసార్లతో పోల్చనా? మీ అమ్మ పాత సినిమాల్లోని ర్యకాంతం... మీ నాన్నేమో బుర్ర లేకుండానే తాటిచెట్టులా ఎదిగిన రమణారెడ్డి లాంటివాడు. ఇక నీ చెల్లెలంటావా? ఆమె ఒక హాలీవుడ్ ఫిగర్. ఆ బ్రహ్మదేవుడు ఒక అనకొండని, మరో డైనోసార్‌ని కలిపి తేలిగ్గా తయారుచేసిన భయానక జీవి.

"మా వాళ్ళ గురించి మరీ అంత నీచంగా మాట్లాడకండి. వాళ్ళేం ఇక్కడే ఉండిపోవటానికి రావటం లేదు. రేపు నగరంలో జరిగే ఓ పెళ్ళికొస్తున్నారు. ఈ రాత్రి ఇక్కడుండి రేపు ఉదయమే వెళ్ళిపోతారు" అంది లత.

"మీ వాళ్ళిక్కడికి వచ్చినప్పుడల్లా అలాగే చెప్తారు. ఒక్కరోజు అని చెప్పి వారం రోజులు తిష్ట వేస్తారు. మనది సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లని వాళ్ళకి తెలీదా? ఉన్న ఒక్క బెడ్‌రూంని మీ అమ్మానాన్న ఆక్రమిస్తారు. మీ అనకొండ చెల్లికి సగం హాలు కావాలి. మిగతా సగం హాల్లో నువ్వూ, చంటి పడుకుంటే నేనెక్కడికెళ్ళాలి? ఇంతకుముందు పక్క పోర్షన్లో బ్రహ్మచారి మిత్రుడుండేవాడు. వాన్ని బతిమాలి అక్కడ పడుకొనేవాన్ని. ఇప్పుడక్కడ వేరే ఫ్యామిలీ ఉంటోంది. ఇప్పుడు మీ వాళ్ళొస్తే నేనెక్కడ చావాలి?"

"స్టోర్ రూమ్‌లో చావండి" రక్కున అనేసి నాలుక్కర్చుకుంది లత. "ఐ మీన్.. స్టోర్ రూమ్‌లో పడుకోండి" అని వెంటనే సర్ది చెప్పింది.

"స్టోర్ రూమ్ అంటే పనికిరాని వస్తువుల్ని పారేసే చోటు. ఇప్పుడు నీ దృష్టిలో నేనొక పనికిరాని వస్తువునయ్యానా" ఉక్రోషంగా అన్నాడు రాంబాబు.

"అది కాదండి. స్టోర్ రూమ్‌ని సర్ది పరుపేసి ఇస్తాను."

"వద్దులే ఆ ఎలుకలు, దోమల మధ్య పడుకోవటం కన్నా రోడ్డు పక్క ఫుట్‌పాత్ మీద పడుకోవడం మేలు. ఇంతకీ మీవాళ్ళు ఖచ్చితంగా ఎనిమిది గంటల ట్రైన్‌కే వచ్చేస్తున్నారా?"

"అవును... ఆ టైమ్‌లోనే వస్తున్నారు. ఇంకో గంటలో ఇక్కడ దిగుతారు. మన ఊరి నుండి వచ్చే ట్రైన్ అదొక్కటే కదా. అయితే తామొస్తున్న సంగతి మా వాళ్ళు నాకు తెలపలేదు. హఠాత్తుగా మన ఇంటికొచ్చి మనకి హ్యాపీ సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకున్నారట. ఈ సంగతి మా బంధువులబ్బాయి నాకు రహస్యంగా ఫోన్ చేసి చెప్పాడు" అంది లత ఉత్సాహంగా.

"అదా సంగతి" రాంబాబు దీర్ఘాలోచనలో పడ్డాడు. ఉన్నట్టుండి అతడి ముఖం

వెలిగింది. రెండు చేతులతో చిటికెలేస్తూ తలకాయను అటూ ఇటూ ఊపసాగాడు. అతడు అలా చేస్తున్నాడంటే అతనికేదో ఐడియా తట్టిందని అర్థం.

"మిసెస్ రాంబాబు ఇందాక నీ మొగుడికి బొత్తిగా బుర్ర లేదన్నావ్ కదూ, ఇదిగో ఇప్పుడు చూపిస్తా నా తడాఖా... మీ వాళ్ళు మనకు చెప్పకుండా మన ఇంటికొచ్చి హ్యాపీ సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకున్నారు కదూ... ఇప్పుడు మనమే ఇంట్లోంచి వెళ్ళిపోయి వాళ్ళకి అన్‌హ్యాపీ సర్‌ప్రైజ్ ఇచ్చేద్దాం" అన్నాడు హుషారుగా.

"ఇంట్లోంచి వెళ్ళిపోతారా, ఎక్కడికి"

"చాలారోజుల్నుంచి నువ్వు ఎగ్జిబిషన్ వెళదామంటున్నావ్ కదూ. పద, ఇప్పుడు నీ కోరిక తీరుస్తాను"

"కానీ మరో గంటలో మా వాళ్ళొచ్చేస్తారు కదండీ" అంది లత.

"వాళ్ళొచ్చేలోగా మనం ఇంటికి తాళం వేసేసి వెళ్ళిపోదాం. మనం అనుకోకుండా ఊరికి వెళుతున్నామని పక్క పోర్షన్ వాళ్ళకి చెప్పి పోదాం. మీవాళ్ళొచ్చి అడిగితే వాళ్ళదే మాట చెబుతారు"

"కానీ మా వాళ్ళు మనకు ఫోన్ చేస్తే ఎలా?"

"మన ఫోన్లు స్విచ్చాఫ్ చేసేద్దాం. మనం ప్రయాణంలో ఉండటం వల్ల ఫోన్లు స్విచ్చాఫ్ చేశామనుకుంటారు. చెప్పకుండా వచ్చినందుకు తగిన శాస్తి జరిగిందనుకొని, డబ్బు ఖర్చు పెట్టి లాడ్జిలో రూమ్ తీసుకుంటారు. మనం హాయిగా ఎగ్జిబిషన్లో గడిపి హోటల్లో చక్కగా భోంచేసి అర్ధరాత్రి ఇంటికి వచ్చేద్దాం"

"కానీ మనం ఊరికి వెళ్ళలేదనే సంగతి రేపు మా వాళ్ళకు తెలిస్తే ఎలాగండి! బాగోదు!"

"అప్పుడొక చిన్న అబద్ధం చెప్పేస్తే సరి. మధ్య దారిలో బస్సు బ్రేక్ డౌన్ కావటంతో టూర్ పోస్ట్ పోన్ అయిందని చెప్పేద్దాం" హుషారుగా అన్నాడు రాంబాబు.

"మా వాళ్ళ నుంచి తప్పించుకోవటానికి ఇన్ని అబద్ధాలు చెప్పటం అవసరమా?"

"అవసరమే డియర్. స్టోర్ రూమ్‌లో ఎలుకలు, దోమలతో సహవాసం చేసే కంటే అబద్ధాలతో సహవాసం చెయ్యడమే ఈజీ. ఇందులో నీక్కూడా లాభముంది సుమా. ఇప్పుడు నీకు వంట చేసే బాధ తప్పుతుంది. పైగా ఎగ్జిబిషన్లో షాపింగ్ కూడా చెయ్యొచ్చుగా."

షాపింగ్ మాట వినగానే లత కళ్ళు మెరిశాయి.

"ఓ... మీరు పర్సు నిండా నోట్లు పెట్టుకోండి. ఈలోగా నేను దుస్తులు మార్చుకుని వస్తా" అని అంటూ ఆమె హుషారుగా బెడ్ రూమ్‌కి వెళ్ళింది.

రాంబాబు ఎంత తొందర పెట్టినా లత, చంటి తయారు కావటానికి గంట పట్టింది. అందరూ బయటికొచ్చి తలుపు వేస్తున్నప్పుడు హాల్ లోని గడియారం ఎనిమిది గంటలు కొట్టడం వినిపించింది. రాంబాబు గుండె కూడా ఎనిమిది సార్లు గట్టిగా కొట్టుకుంది.

'ఈపాటికి ట్రైన్ స్టేషన్‌కి వచ్చి ఉంటుంది. తాము త్వరగా అక్కడ్నించి వెళ్ళిపోవాలి' అనుకుంటూ ఇంటికి తాళం వేసి గబగబా పక్క పోర్షన్ తలుపు దగ్గరికెళ్ళి హడావుడిగా

కాలింగ్ బెల్ నొక్కాడు. రెండు మూడుసార్లు బెల్ మోగాక ముసలాయన ఒకతను వచ్చి తలుపు తెరిచాడు.

"మేం అనుకోకుండా ఊరికెళుతున్నామండీ. ఎవరైనా మా కోసం వస్తే ఇదే మాట చెప్పండి" అంటూ ఉపోద్ఘాతం లేకుండా నేరుగా విషయం చెప్పేసి హడావుడిగా వెనుదిరగబోయాడు రాంబాబు.

"ఏమన్నావ్ నాయనా?" ముసలాయన తాపీగా అడిగాడు. ఆయనకి వినికిడి సమస్య ఉందని గుర్తుకు వచ్చిన రాంబాబు ఇందాక చెప్పిన విషయాన్నే కాస్త గట్టిగా చెప్పాడు. కానీ రెండు మూడు సార్లు స్వరం పెంచి చెప్పినా ముసలాయనకి వినపడలేదు. గట్టిగా అరవడం వల్ల రాంబాబుకి మాత్రం తెరలు తెరలుగా దగ్గొచ్చింది. ముసలాయన గొంతు పిసకాలన్నంత కోపమొచ్చిందతనికి.

"ఉండు నాయనా, నా హియరింగ్ మెషీన్ పెట్టుకొస్తాను" అంటూ ముసలాయన లోపలికి వెళ్ళాడు. రాంబాబుకి క్షణమొక యుగంలా గడుస్తోంది. తన అత్తామామలు ఈ పాటికి ట్రైన్ దిగి ఆటోలో బయల్దేరి ఉంటారనిపించింది రాంబాబుకి.

ముసలాయన ఐదు నిమిషాల తర్వాత చెవికి మెషీన్ పెట్టుకొని వచ్చాడు. రాంబాబు ఇందాక చెప్పిన విషయాన్నే గబగబా రిపీట్ చేశాడు. ముసలాయన వినపడిందని తల ఊపగానే వెనుతిరిగి భార్య, పిల్లవాడితో కలసి రోడ్డు మీదికి వచ్చాడు. తన సెల్‌తో పాటు భార్య సెల్‌ని కూడా రాంబాబు స్విచ్చాఫ్ చేశాడు.

ముగ్గురూ ఫుట్‌పాత్‌పై నిల్చుని ఖాళీ ఆటోల కోసం ఎదురు చూడసాగారు. రెండు మూడు ఖాళీ ఆటోలు వచ్చినా ఎగ్జిబిషన్‌కి వెళ్ళటానికి నిరాకరించారు. రాంబాబుకి ఉన్నట్లుండి టెన్షన్ పెరగసాగింది. చివరికి ఓ ఆటోవాడు మీటర్‌పైన వంద రూపాయలిస్తే ఎగ్జిబిషన్‌కి వస్తాను అన్నాడు. గత్యంతరం లేక రాంబాబు ఒప్పుకున్నాడు.

ఏ క్షణంలోనైనా తన అత్తామామలు ఆటోలో అక్కడికి చేరుకోవచ్చు. వాళ్ళు రాకముందే తమ ఆటో కాలనీ దాటి పోవాలనుకున్నాడు. అందుకే ఆటోవాన్ని వేగంగా వెళ్ళమని కోరాడు. అతడలా కోరగానే డ్రైవర్ ఆటోని వేగంగా ముందుకు ఉరికించాడు.

ఆటో కాలనీ దాటుతుంటే ఎదురుగా మరో ఆటో ఎదురైంది. అందులో ఓ ముసలిజంటతో పాటు ఓ లావాటి అమ్మాయి కూర్చొని ఉండటం రాంబాబుకి అస్పష్టంగా కనపడింది. వాళ్ళు తన అత్తామామలు, మరదలే అని రాంబాబుకి అర్థమైంది..!

వెంటనే తన ముఖం వాళ్ళకు కనపడకుండా పక్కకి తిప్పుకున్నాడు. అప్పుడే ఊహించని ఘటన జరిగింది. రాంబాబు ఫ్యామిలీ ఉన్న ఆటో టాప్ తగిలి ఎదురుగా వస్తున్న ఆటో రియల్ వ్యూ మిర్రర్ పగిలింది.

దాంతో ఆ ఆటోవాడు రాంబాబు ఆటోడ్రైవర్‌తో గొడవకు దిగాడు. మిర్రర్ పగలగొట్టినందుకు రెండు వందలు కట్టమన్నాడు. దానికి రాంబాబు ఆటోవాడు ఒప్పుకోలేదు. దాంతో ఇద్దరి మధ్య గొడవ పెరిగింది. ఈ గొడవ వల్ల తన అత్తామామల దృష్టి తమపై పడితే అసలుకే మోసమొస్తుందని భయపడ్డ రాంబాబు పర్సులోంచి రెండొందలు తీసి

మిర్రర్ పగిలిన ఆటో వాడికిచ్చి పంపేశాడు.

అది చూసి లత ఆశ్చర్యపోయింది. "వాడికి మీరెందుకు డబ్బులిచ్చారు" అనడిగింది.

"ఆ ఆటోలో మీ అమ్మానాన్నలు ఉన్నారు కదా... గొడవ పెరిగితే వాళ్ళు మనల్ని చూడొచ్చు. అందుకే వాడికి డబ్బిచ్చి పంపేశా" అన్నాడు రాంబాబు తన తెలివికి తనే మురిసిపోతూ.

"అయ్యో కర్మ... మీకు మతి తప్పింది. ఆ ఆటోలో వున్నవారు మా అమ్మానాన్నలు కారు. ఎవర్నో చూసి మా అమ్మానాన్నలనుకున్నారు" నెత్తి బాదుకుంటూ అంది లత. రాంబాబుకి కళ్ళు బైర్లు కమ్మాయి. పచ్చ కామెర్లు సోకినవాడికి లోకమంతా పచ్చగా కన్పించినట్టు అత్తామామల జబ్బు సోకిన తనకి ఎవర్ని చూసినా అత్తామామల్లాగే కన్పిస్తున్నారన్పించింది. అనవసరంగా కంగారుపడి రెండొందలు పోగొట్టుకున్నందుకు తనను తాను తిట్టుకుంటూ కూర్చున్నాడు.

ఈ జబ్బు ఎగ్జిబిషన్లోనూ కొనసాగింది. టికెట్టిచ్చే లావాటి అమ్మాయి మరదలిలా కన్పించి భయపెట్టింది. ఉయ్యాలలూగుతున్న ఓ వృద్ధజంటను చూసి తన అత్తామామలే అనుకున్నాడు. గాజులషాపులో, మ్యాజిక్ షోలో, సిమ్లా బజ్జీలు తింటూ, కూల్డ్రింక్ తాగుతూ వాళ్ళే కన్పించి భయపెట్టారు.

మరోపక్క దొరికిన అవకాశాన్ని లత పూర్తిగా వాడుకుంది. భారీగా షాపింగ్ చేసి తన ముచ్చట తీర్చుకుంది. చంటి కూడా అన్ని రకాల ఊయలలు ఊగి, గేములు ఆడి తన సరదా తీర్చుకున్నాడు. తండ్రి పర్సు బరువు అనుకున్న దాని కంటే తగ్గించారు.

రాత్రి పదిన్నరకి వాళ్ళు ఎగ్జిబిషన్లోంచి బయటికొచ్చి పక్కనేగల ఖరీదైన హోటల్లోకి వెళ్ళారు. అక్కడ భోజనాలు చేశాక రాంబాబు పర్సు దాదాపు ఖాళీ అయిపోయింది. అయినా అతను బాధపళ్ళేదు.

రావణుడు, మండోదరి వంటి అత్తామామలు, శూర్పణఖ లాంటి మరదలి బారి నుండి తప్పించుకోవటానికి ఈ మాత్రం త్యాగం తప్పదు అనుకున్నాడు.

వాళ్ళు ఆటోలో ఇంటికి చేరుకొనేసరికి పదకొండున్నరయింది సమయం. ఇంటి దగ్గర అంతా నిశ్శబ్దంగా ఉంది. హమ్మయ్య ఇక్కడ ఎవరూ లేరు. మీవాళ్ళొచ్చి పక్క పోర్షన్లో మన గురించి అడిగి తెల్సుకుని తిరిగి వెళ్ళిపోయినట్టున్నారు. ఇక మనం ప్రశాంతంగా, నిశ్చింతగా పడుకోవచ్చు" తాళం తీస్తూ ఎంతో ఉత్సాహంగా అన్నాడు రాంబాబు.

"పాపం, ఎక్కడికెళ్ళారో?" విచారంగా అంది లత.

"పాపం లేదు. పుణ్యం లేదు. చెప్పకుండా వచ్చి మనల్ని ఫూల్ చెయ్యాలనుకున్నారు. తామే ఫూల్ అయ్యారు. ఇక గత్యంతరం లేక ఏదైనా లాడ్జిలో దిగి ఉంటారు. ఎలాగోలా పీడ విరగడైంది చాలు" అని ఆవులిస్తూ అన్నాడు రాంబాబు.

బాగా అలసిపోవటంతో ముగ్గురికీ నిద్ర ముంచుకొస్తోంది. కాసేపట్లోనే అందరూ నిద్రకుపక్రమించారు. రాంబాబు నిద్రలోకి జారుకోబోతుండగా...

కొద్దిక్షణాల తర్వాత కాలింగ్ బెల్ మోగింది.

పక్కన బాంబు పేలినట్టు అదిరిపడ్డాడు రాంబాబు. తడబడే అడుగులతో వెళ్ళి తలుపు తెరిచాడు. ఎదురుగా నిల్చున్న వ్యక్తుల్ని చూడగానే అతని గుండె ఆగినంత పనయింది.

"ఏంటోయ్ అల్లుడూ, బావున్నావా?" అంటూ మామ లోపలికి అడుగు పెట్టాడు. అతని వెనకనే అత్త, గున్నఏనుగు లాంటి మరదలు భారంగా అడుగులు వేస్తూ ఇంట్లోకి అడుగు పెట్టారు.

రాంబాబు ముగ్గురి వైపు విస్మయంగా చూస్తూండి పోయాడు. అప్పుడే బెడ్ రూమ్‌లోంచి హాల్లోకొచ్చిన లత కూడా తన వాళ్ళని ఆశ్చర్యంగా చూసింది.

వాళ్ళిద్దరి వాలకం చూసి రాంబాబు అత్త గలగలా నవ్వింది. "ఏంటలా బెల్లం కొట్టిన రాళ్ళ మాదిరి చూస్తున్నారు? చెప్పకుండా హఠాత్తుగా ఊడిపడ్డామని ఆశ్చర్యపోతున్నారా? మీకు హ్యాపీ సర్‌ప్రైజ్ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఫోన్ కూడా చెయ్యకుండా వచ్చేశాం. రేపు మీ ఊర్లో జరిగే పెళ్ళికి వెళ్ళొచ్చి ఓ వారం రోజులు మీ ఇంట్లోనే ఉంటాం. అంతకంటే ఎక్కువ రోజులు ఉండమని మాత్రం బలవంతం చెయ్యకండి" అంది.

తన అత్త మాటలు వినగానే రాంబాబుకి నోట మాట రాలేదు. ముందుగా తేరుకున్న లత గొంతు పెగల్చుకొని అంది, "అది కాదమ్మా మన ఊరి ట్రైన్ రాత్రి ఎనిమిదికే ఇక్కడికి చేరుకుంటుంది కదా. ఆ తర్వాత ఇంకో ట్రైన్ లేదు. మీరీ టైమ్‌లో ఎలా వచ్చారు?" తన మనసులోని సందేహాన్ని బయట పెట్టింది.

"నిజమే అమ్మాయ్... లెక్క ప్రకారం మేం రాత్రి ఎనిమిదికే ఇక్కడికి చేరుకోవాలి. కానీ ట్రైన్ మూడు గంటలు ఆలస్యంగా నడుస్తోంది. అందుకే ఈ టైమ్‌లో ఇక్కడ దిగాం" అని తాపీగా చెప్పిందావిడ.

అది విన్న రాంబాబు అసహనంగా జుట్టు పీక్కున్నాడు. "వెధవ ట్రైన్లు... ఎప్పుడూ లేటే. ఈ దేశం ఎప్పుడు బాగుపడుతుందో..." ఉక్రోషంగా అన్నాడు.

"అవునోయ్... ట్రైను ఆలస్యం అయితే అందరికీ కష్టమే" అన్నాడు అతని మామ.

"కష్టమే కాదు... నష్టం కూడా. ఖాళీ అయిన పర్సుని తలచుకుంటూ గొణుక్కున్నాడు రాంబాబు. తను పడుకోవాల్సిన స్టోర్ రూం వైపు దీనంగా చూశాడు.

⌘

స్వాతి సపరివార పత్రిక - 12.09.2014.

అదివో... అల్లదివో... అమెరికా!

చిలుకూరి దీవెన – 94411 18102

ఇంకా తెల్లారలేదు... గణగణగణమంటూ అలారం మోగింది. కాంపౌండ్ గోడ మీద కునికిపాట్లు పడుతున్న ఎర్రకోడిపుంజు వులిక్కిపడింది.

'పాడు అలారం మంచి కునుకు పాడు చేసింది' అనుకుంటూ రెక్కల్ని టపటపలాడించి 'కొక్కరో క్కో...' అంటూ కూయడం మొదలుపెట్టింది.

అప్పుడే నాలుగ్గంటలయిందా? దీని దుంపతెగ అని గొణుక్కుంటూ అలారం పీస్ పీక నొక్కాడు రామనాథం. అది ఆగింది. అయితే కోడిపుంజు మాత్రం కూస్తూనే వుంది. అది పక్కింటి వాళ్లది కాకుంటే ఈ పాటికి ఎప్పుడో కోసి కూరొండుకు తినేసి వుండేవాడు రామనాథం. నిద్రాభంగం కావడంతో విసుగ్గా కొడుకు గదిలోకి వచ్చి "లేవరా రాజేష్ అప్పుడే నాలుగ్గంటలయ్యింది. ట్యూషన్ కి పోవాలి కదా!" లేపుతున్నాడు. కళ్లలో విసుగుని నిద్ర మింగేసింది. మధ్య మధ్య ఆవులిస్తున్నాడు అతను

"రేయ్ లేవరా!"

"ఊ డాడీ! అయిదు నిమిషాలు!" అన్నాడు రాజేష్ అటు తిరిగి పడుకుంటూ.

వీడి ట్యూషన్ మాట దేవుడెరుగు, వీడిని నిద్ర లేపడానికి నేను మరో అయిదు నిమిషాలు నిద్ర మానుకొని ఎదురు చూడాలి!" అనుకొని.

"ఊహూ! అయిదు నిమిషాలు కాదు కదా అరనిమిషం కూడా నిద్రపోనీను. ఇదే అమెరికాలో అయితే నీ వయసు వాళ్లు ఇంత సోమరిగా వుండరు" అన్నాడు.

అమెరికా అన్నమాట అప్రయత్నంగా తన నోట రాగానే రామనాథం నిద్ర ఠక్కున ఎగిరిపోయింది. రెట్టించిన ఉత్సాహంతో నిద్ర లేపడం మొదలు పెట్టాడు. రామనాథానికి అమెరికా అన్న పదమే ఓ అనిర్వచనీయమైన ఆనందాన్ని కలుగజేస్తుంది. భారతదేశంలో పుట్టినందుకు, అందునా తెలుగువాడిగా పుట్టినందుకు కృంగిపోయే చాలామంది లాగే రామనాథం కృంగిపోతుంటాడు ఎప్పుడూ.

కత్తిరించినా లాభం లేకుండా అతుక్కుపోతున్న రెప్పల్ని బలవంతంగా తెరవడానికి ప్రయత్నిస్తూ లేచి కూర్చున్నాడు రాజేష్.

"అమెరికాలో నిన్ను ఎవర్రా ఇంతసేపు లేపేది? నీ అంతట నువ్వే లేచి రెడీ అవ్వాలి మరి. టెంత్‌లోనే నువ్వు ఇలా అయితే కష్టంరా! లే... త్వరగా రెడీ అవ్వు" అన్నాడు.

రాజేష్ నెమ్మదిగా అడుగులో అడుగేస్తూ బాత్‌రూం వైపు నడిచాడు. నడుస్తూ, రెడీ అవుతూ కూడా నిద్రపోయే వీలు లేనందుకు బాధపడుతూ, మరో పక్క అమెరికా జపంతో పరవశించిపోయే తండ్రిని చూసి 'అసలు ఆ అమెరికాను కనిపెట్టిన కొలంబస్సే నా ముందుకొస్తే ఇప్పుడు నా చేతుల్లో అయిపోయేవాడు!' అనుకున్నాడు.

ఇలా ప్రతిరోజూ తెల్లారే అనుకోవడం, బాధపడడం రాజేష్‌కు పరిపాటే! మరోవైపు అమెరికా తన్మయత్వంలో...

'అమెరికాలో మనుషులు అసలెంతసేపు నిద్రపోతారో! నిద్రపోతారో లేదో! అయినా సుబ్బరంగా రెండు చేతులారా సంపాయించే వారికి నిద్రెందుకు? వీడు అమెరికా పోయింతర్వాతయినా మారతాడో లేదో?" అంటూ తనలో తానే మాట్లాడుకుంటున్నాడు రామనాథం.

ఈ గోలతో రామనాథం భార్య సుజాతకు కూడా మెలకువ వచ్చింది.

"అబ్బ మీ అమెరికా గోల అప్పుడే మొదలుపెట్టేశారూ! పాపం వాడిని ఎందుకు కాల్చుకు తింటారు? రాత్రి 12 గంటల దాకా చదివించారుగా! కనీసం అయిదు గంటల సేపయినా నిద్ర లేకపోతే వాడి ఆరోగ్యం ఏమయిపోవాలి? ఈ వయసు పిల్లలు దాదాపు ఎనిమిది గంటలు నిద్ర పోవాలిట. వాడింకా టెన్తే కదా చదువుతున్నాడు. మీరేమో రేపే అమెరికా ఫ్లైట్ ఎక్కించేసేలా వున్నారే!" అంది చిరుకోపంతో.

"ఇదిగో ఇలాగే వాడిని గారాబం చేసి చెడగొడుతున్నావు" అన్నాడు.

ఈలోగా రాజేష్ రెడీ అయిపోయి గోనెసంచికి అటూ ఇటూగా వున్న బ్యాగునొకదాన్ని రెండు భుజాలకు తగిలించుకొని అందులో స్థలం చాలకేమో చెరో కేజీ వున్న మహా గ్రంథాల్లాంటి పుస్తకాలని రెండింటినీ రెండు చేతులతో బలంగా పట్టుకొని హడావుడిగా పరుగులాంటి నడకతో వెళ్ళబోయాడు. ఇంతలో సుజాత వాడికి హార్లిక్స్ కలిపి తెచ్చింది.

"తాగరా! హార్లిక్స్ తాగిపో! అంతంత బరువు మోస్తావు శక్తి కావాలి కదా!" అంటూ తాపత్రయపడుతోంది.

"లేదమ్మా! వచ్చిన తరువాత తాగుతాలే! ఇప్పుడు టైం లేదు. ఆలస్యమైతే మాస్టారు ఈ బ్యాగుతోనే గుంజీళ్లు తీయమంటారు" అంటూ వెళ్లిపోయాడు.

"చూశారా వాడిని. ఉత్త కడుపుతో 8 గంటల వరకూ ఎలా వుంటాడు" అంది బాధగా.

"ఏం ఫరవాలేదు! తిండి, నిద్ర, నీళ్ళు, పాలు అనుకుంటూ వుంటే ఇక వాడు ఎంసెట్లో ర్యాంకు తెచ్చుకున్నట్లే. అమెరికా పోవాలంటే ఆ మాత్రం కష్టపడాల్సిందే" అన్నాడు.

"మీకు చెప్పడముందే!" అని తల పట్టుకొని వంటింట్లోకి వెళ్లిపోయింది సుజాత.

8 గంటలకంతా వచ్చేశాడు రాజేష్. అప్పటికే స్కూల్ యూనిఫాంతో సహా రెడీ అయిపోయి వుండడం వల్ల ట్యూషన్ హోంవర్క్ రాసుకుంటున్నాడు.

"వాట్ రాజేష్! ఆర్ యూ కంప్లీటెడ్ యువర్ హోంవర్క్?" అన్నాడు హోంవర్క్‌లో

పీకల్లోతు మునిగిపోయిన రాజేష్‌తో రామనాథం.

"ఆ నాన్నా అయిపోయింది" అన్నాడు. అంతే రామనాథానికి కోపం నషాళానికి అంటింది. రామనాథం ఎంతటి తప్పయినా క్షమిస్తాడు కానీ పొరపాటునన్నా తన కన్నకొడుకు 'నాన్న' అంటే భరించలేడు.

"ఏరా వెధవా! నాన్నా అంటూ తెలుగులో ఏంట్రా? ఆ ముక్క ఇంగ్లీషులో అనలేవూ?" అన్నాడు. కానీ వాడికి బదులిచ్చే తీరిక కూడా లేదు. అయితే సుజాతకు మాత్రం 'మమ్మీ' అంటే సరిపోదు. కమ్మగా 'అమ్మ' అనాలంటుంది.

సుజాత రాజేషుకు టిఫిన్ తీసుకొచ్చింది. వాడు దాని దిక్కయినా చూడకుండా గడియారం వంక చూస్తూ రెండు చేతులతో నోట్లో కుక్కుకొని నీళ్ల సహాయంతో మింగే ప్రయత్నంలో వున్నాడు.

"చూడవే వీడు! ఇప్పటికీ సరిగా ఇంగ్లీష్ మాట్లాడలేక పోతున్నాడు. అమెరికాకు పోయినా ఇంతేనా వీడు? అమెరికన్ ఇంగ్లీష్ గడగడా మాట్లాడుతూ, అమెరికా కార్లో, అమెరికా వాడిలా తిరుగుతూ వుంటే..." రామనాథం ఊహల్లో తేలుతున్నాడు.

"అమ్మా... డాడీ! టాటా..." అన్నాడు రాజేష్.

"అప్పుడే అమెరికాకా?" అన్నాడు రామనాథం వులిక్కిపడి.

"అబ్బా! స్కూల్‌కి డాడీ!" అనేసి వాడు వెళ్లిపోయాడు.



ఆరోజు సాయంత్రం ఇంటికి వస్తూనే సుజాతతో చెప్పాడు రామనాథం.

"సుజాతా మా రామారావు చిన్న తమ్ముడు అమెరికాలో సాఫ్ట్వేర్ ఇంజనీర్ అని చెప్పాగా! అతను నిన్ననే ఇక్కడికి వచ్చినాడంట. వాళ్ల చిన్నాన్న కూతురి పెళ్లికని. నేనోసారి రామారావుతో 'నీ తమ్ముడు వస్తే చెప్పవోయ్ అమెరికా గురించి కాస్త వివరంగా తెలుసుకోవాలి' అని అన్నానులే. అందుకే ఆఫీసుకి ఫోన్ చేశాడు. మరి నే వెళ్ళొస్తా".

"ఆ! అతడిని అడిగి అమెరికాలో ఎలా గాలి పీల్చాలి? ఎలా తుమ్మాలి? ఎలా నమలాలో కూడా తెలుసుకుని రండి. ఎప్పుడూ అమెరికా... అమెరికా... అమెరికా! అయ్యో అదేంటి అప్పుడే బయలుదేరుతున్నారు? కాఫీ తాగి టిఫిన్ తిని వెళ్లండి అంటుంటే..."

"ఆ! టిఫిన్‌దేముంది? అతనిప్పుడే ఫ్రీగా వున్నాడంట. మళ్లీ అతను బిజీ అయిపోతే నేనెక్కువసేపు మాట్లాడలేను కదా?" అన్నాడు రామనాథం తన తెలివితేటలకు తన జబ్బలను తానే చరచుకుంటూ.

"సంతోషించాంలెండి!" అంది సుజాత.

మరుసటి రోజు మధ్యాహ్నం భోజనానికి రావడంతోటే ఏవేవో రకరకాల కవర్లు పట్టుకొని సుజాత చేతికిచ్చి లోపల పెట్టమన్నాడు రామనాథం.

"ఏమిటండీ ఇవి? ఇవాళ విశేషమేమీ లేదు కదా?" అంది అనుమానంగా.

"విశేషమేమీ లేదు గానీ ఇవన్నీ రాజేష్‌కే" అని ఒక్కొక్కటి తెరచి చూపిస్తూ "ఇది

డైనింగ్ టేబుల్ డ్రస్, ఇది బ్రెడ్డు, ఇది జామ్, ఇవేమో ఫోర్కులు, కత్తులూ, స్పూనులూ" అంటూ లిస్టంతా చెప్పాడు.

"ఇవన్నీ ఎందుకు? మనవాడు మామూలుగా బాగానే తింటున్నాడే?"

"అది కాదు నేను నిన్న కలిసానే ఆ అమెరికా ఆయన చెప్పాడు. ఇవన్నీ అమెరికాలో డైనింగ్ టేబుల్ మానర్స్ అని. అందుకే తెచ్చా. ఇప్పటి నుండీ అలవాటు చేస్తే అమెరికాలో వాడు ఈజీగా అడ్జెస్ట్ అయిపోతాడు. అరెరే! నీకసలు చూపించనే లేదు కదూ!" అంటూ జేబులోంచి ఆరు రకాల రంగురంగుల మాత్రల షీట్లు బయటకు తీశాడు.

"ఇవేమిటి? ఏమయింది? మీకేమన్నా ఒంట్లో బాగాలేదా? అయినా డాక్టరు ఇన్ని రకాల మాత్రలు ఎందుకు ఇచ్చాడు. నాకేదో భయంగా వుంది అంది కంగారు పడుతూ.

"అయ్యో పిచ్చి సుజీ! నాకేమీ లేదు. ఇవి నా కోసం కూడా కాదు. అన్నీ మన రాజేష్ కోసమే'' అంటుంటే సుజాతకు ఒళ్ళంతా చెమటలు పట్టేసి వరండాలో కూలబడిపోయింది.

ఆమె ఎందుకలా అయిపోయిందో అర్థంకాక భయపడిపోతున్నాడు. రామనాథం. సుజాత మెల్లగా వణుకుతున్న కంఠంతో...

"నిజం చెప్పండి? రాజేష్‌కేమయింది? మీరేదో దాస్తున్నారు" అంది రామనాథాన్ని అయోమయంగా చూస్తూ.

"రాజేష్‌కా... వాడికేమయింది" అన్నాడు.

"మరి వాడికి అన్ని మాత్రలెందుకు?" అంది అనుమానంగా.

"ఓసి! ఇవా! ఇవి రోగాలకి రొష్టులకి వాడే మందులు కాదే! ఇదిగో ఈ ఆరు రంగుల మాత్రలు ఒక్కోటి ఒక్కో సబ్జెక్టు మీద ఇంట్రస్టు పెంచుతాయట! ఒక్కో రంగువి ఒక్కోరోజు వాడితే మనవాడు అన్ని సబ్జెక్టుల్లో మాస్టరయిపోతాడు. అమెరికా వాళ్ళే వెతుక్కుంటూ వచ్చి మనవాడిని అమెరికా తీసుకొని పోతారు!!" అన్నాడు వుత్సాహంగా.

సుజాతకు నిజంగా చిర్రెత్తుకొచ్చి ఇంతెత్తు లేచింది రామనాథం మీదకి.

"ఇది కూడా ఆ అమెరికా వాడే చెప్పాడా?" అని కోపంగా అంటూంటే...

"లేదు లేదు, ఇందాక మా ఆఫీసుకి ఓ మందుల ఫ్యాక్టరీ ఏజెంటు వచ్చినాడులే, అతను చెప్పాడు. ఎంత మేలు కదా? రోజులెంత మారిపోయాయి సుజీ! ఇట్లాంటివే మా కాలంలో వుండుంటే ఈ పాటికి మనమందరం అమెరికాలో వుండేవాళ్లం'' అని మురిసిపోతున్నాడు రామనాథం. సుజాతకి ఒళ్లు మరింత మండింది.

"అంటే ఎవరో ఏదో చెప్పారని అడ్డమైన మాత్రలు వాడి చేత మింగిస్తారా? రేప్పొద్దున ఇంకెవడన్నా టెక్స్ట్ బుక్కుల్ని మెత్తగా రుబ్బి వుండగా మింగిస్తే ఆ పుస్తకాల్లోని జ్ఞానమంతా వచ్చేస్తుందని చెబితే అలాగే చేసేలా వున్నారు?" అంది అక్కసుతో.

కానీ రామనాథం "అలా ఏమయినా వీలవుతుందా?" అని ఆలోచిస్తున్నాడు.

'దేవుడా! దయచేసి అమెరికాలో అందరూ కాళ్లతో కాక చేతులతో నడుస్తారని ఎవరి చేతా చెప్పించకు ప్లీజ్" అని మనసులో గట్టిగా వేడుకుంది.

⌘

రెండు రోజుల తరువాత ఓ సాయంకాలం ఆఫీసు నుండి హడావుడిగా ఇంటికొచ్చి నేరుగా వంటగదిలో వున్న సుజాత దగ్గరికి పోయి

"సుజాతా! సుజాతా! నాకు జ్ఞానోదయమయింది. ఇన్ని రోజులూ నేనెంత తప్పు చేశానో నాకర్థమయింది. నా స్నేహితుడొకడు నా కళ్ళు తెరిపించాడు" అన్నాడు.

సుజాత మొహంలో ఒక్కసారిగా వెయ్యి పెట్రోమాక్స్ లైట్లు వెలిగాయి.

'అంటే ఈయన ఇక అమెరికా గోల మానేస్తాడన్నమాట. ఆహా!' అనుకొని ఎగిరి గంతేయాలనుకుంది. ఆనందంతో నిశ్చేష్టురాలయిపోయింది. రామనాథం కుదపడంతో తేరుకుంది.

"ఏమిటలా అయిపోయావ్? ఇన్ని రోజులూ మనవాడు పొద్దున్నే లేవడానికి ఇబ్బంది పడుతూ స్కూలు నుండి ఇంటికి వచ్చినప్పటి నుండీ నీరసంగా, నిరుత్సాహంగా వుంటూ ఎప్పుడెప్పుడు నిద్రపోదామా? అన్నట్లు వుంటున్నాడు కదా!" అన్నాడు.

"అవును మరి! నిద్ర చాలకపోతే అలాగే వుంటుంది" అంటూ అడ్డు తగిలింది.

"ఆ... అదే నేనూ అవునేమో అనుకునేవాడిని, అది కాదు. లోపమంతా మనం వాడికి పెట్టే తిండిలోనే వుంది. నువ్వు వాడికిష్టమని చపాతీలు, మసాలాలు, గుడ్లు అన్నీ పెడుతున్నావు గదా... అదేనట అసలయిన లోపం" అని కాస్త ఊపిరి పీల్చుకొని జేబులోంచి భద్రంగా ఒక కాగితాన్ని తీసి సుజాతకు చూపిస్తూ

"ఇదిగో ఈ ఫుడ్ టైంటేబుల్ చూడు. ఇది పాటిస్తే మనవాడు ఫాస్ట్ అయిపోయి అందరికన్నా ముందు అమెరికా ఫ్లైట్ ఎక్కేస్తాడు అన్నాడు రామనాథం.

ఆ టైంటేబుల్ ఇలా వుంది.

ఉదయం: నానబెట్టిన బఠానీలు ఒక కప్పు, ఒక గ్లాసుడు పాలు.

మధ్యాహ్నం: సరిగ్గా పన్నెండున్నరకి రోకటితో దంచిన దంపుడు బియ్యం 150 గ్రాములు, మరో వంద గ్రాముల పచ్చి కూరగాయల భోజనం.

రాత్రికి: మళ్లీ 150 గ్రాముల దంపుడు బియ్యం, 100 గ్రాముల పచ్చి కూరగాయల భోజనం.

సుజాత మొహంలో పవర్ కట్!

⌘

నవ్య దీపావళి ప్రత్యేక సంచిక, 2006

ఆషాడం పెళ్ళి

తరిమెల అమరనాథ్ రెడ్డి – 93467 35480

ఆషాఢం పెళ్ళి – తరిమెల అమరనాథ్ రెడ్డి

"శాంతా సాయంత్రం ఐదుగంటలకు మా ఫ్రెండ్ పెళ్ళి వుంది. నువ్వు త్వరగా రెడీ అయితే పోదాం" అన్నాను నా భార్యతో

"సాయంత్రమేం పెళ్ళండి. యివ్వేళప్పుడు ఏం ముహూర్తం వుంటుంది" అడిగింది ఆశ్చర్యంగా. "పెళ్ళికొడుకు కమ్యూనిస్టు, నాస్తికుడు కూడా" "కమ్యూనిస్టులు అంతా నాస్తికులే కదా". "కాదు. వాళ్ళల్లో కూడా చాలా మందికి అన్ని మూఢనమ్మకాలు వున్నాయిలే".

"ఔను యిది ఆషాఢమాసం, అదీకాక శూన్యమాసం కూడా. అసలు ఆషాఢమాసంలో పెళ్ళయిన ఆలూమగలను కూడా ఈ నెలంతా దూరం పెడతారు కదా. ఈ రోజు అమావాస్య కదా"

"అయిండొచ్చు. ముస్లిమ్‌లు అమావాస్య రోజు చేసుకుంటారు కదా మనం చేసుకుంటే ఏమౌతుంది. అసలు ఈ రోజు మా ఫ్రెండ్ పుట్టినరోజు కావడం వల్ల అవేవీ లెక్కచేయకుండా అమావాస్య అయినా చేసుకుంటాండాడు. పుట్టిన రోజు కన్నా మంచిరోజు మరేముంటుంది".

"కర్నాటకలో ఆషాఢ మాసమైనా చేసుకుంటారంట కదండీ" "యిక్కడ కూడా చేసుకుంటారు కదా".

"ఎవరు ముస్లిములా?

"కాదు, మన పెళ్ళిల్లకు ముహూర్తాలు పెడతారే ఆ పురోహితులు కూడా తమ పిల్లలకు ఆషాఢమాసమైనా చేస్తారని తెలిసింది".

"అట్లనా మనకు ముహూర్తాలు లేవని వాళ్ళ పిల్లలకు ఎట్ల చేస్తారండీ"?

"ఏమీ లేదు. ఈ నెలల్లో అయితే కళ్యాణ మంటపాలు అన్నీ ఖాళీగా వుంటాయి. వంటోల్లు, వాయిద్యగాళ్ళు మన వెంట పడతారు కదా. అన్ సీజన్ కాబట్టి కళ్యాణమంటపాలు సగం రేటుకే వస్తాయి. అదీకాక ముహూర్తాలుండే నెలల్లో చేసుకుంటే పురోహితుల బతుకుతెరువు దెబ్బతింటుంది కదా" అన్నాను నవ్వుతూ.

"అదీ కరెక్టే, అదీ కాకుండా యిప్పుడైతే వేరే ఎవరి పెళ్ళిల్లు వుండవు కాబట్టి పెళ్ళికి పిల్చిన బంధుమిత్రులందరూ యిబ్బంది లేకుండా వస్తారు కదా" అనింది.

"ఔను మామూలు పెళ్లిళ్ల సీజన్లో పది పత్రికలు వస్తే ఎవరి పెళ్ళికి పోవల్లనో, ఎవరితో నిష్ఠూరం పడల్లో అని పెళ్ళిల్లు చేసేవాళ్ళకు ఎంత యిబ్బందో రావల్లనుకున్నోల్లకు కూడా అంతే యిబ్బంది కదా, యిట్ల ముహూర్తాలు అనుకోకుండా ఎవరి పుట్టినరోజు వాళ్ళు చేసుకుంటే ఎవ్వరికీ యిబ్బంది వుండదు కదా" అన్నాను నవ్వుతూ.

"అదంతా సరే. కమ్యూనిస్టు పెళ్ళి అంటున్నారు. పురోహితుని మంత్రాలు వుండవా?"

"పురోహితుడే వుండడు. యిక మంత్రాలు ఎక్కడుంటాయి. కొంతమంది నాయకులు వస్తారు. వాళ్ళ ఉపన్యాసాలు వుంటాయి" అన్నాను.

"అబ్బా ఆ సుత్తి నేను భరించలేను. ఏదో స్వామి మంత్రాలు చదువుతాంటే మనం పెళ్ళికి వచ్చిన ఫ్రెండ్స్‌తోనో, బంధువులతోనో మాట్లాడుకుంటా వుండొచ్చు. ఉపన్యాసాలైతే మనం ఏమీ మాట్లాడకుండ వాళ్ళ సుత్తి భరించల్ల, నాతో కాదు" అనింది.

"నువ్వు చెప్పేది కరెక్ట్, ఏదో ఒకరు సుత్తి కొడితే భరించవచ్చు. వచ్చిన నాయకులందరూ మాట్లాడల్లనుకుంటారు. అదీకాక వాళ్ళ మీటింగ్‌లకు రానంత జనం వుంటారు కదా. యింత కన్నా ఛాన్స్ ఎప్పుడొస్తుందన్నట్లు తమ ఛాన్స్ కోసం ఎదురు చూస్తాంటారు" అన్నాను నవ్వుతూ.

"ఔను ఈ ఉపన్యాసాల బదులు వచ్చిన వాళ్ళందరికీ తలాకు ఒక పేపర్ యిచ్చి అందులో వారి అభినందనలు వ్రాయమంటే సరిపోతుంది కదా. అవన్నీ ఒక పుస్తకరూపములో బైండ్ చేసుకొని అప్పుడప్పుడు చూసుకుంటే బాగుంటుంది కదా" అనింది శాంత.

"మంచి ఆలోచనే. చూస్తాం వాళ్ళు ఏం చేస్తారో. ఉపన్యాసం మొదలైతేనే మనం యింటికి వచ్చేద్దాములే" అన్నాను.

"అట్లయితేనే వస్తాను, వుండండి త్వరగా రెడీ అయితాను" అనింది. కాస్సేపటికి రెడీ అయి వస్తూనే యిద్దరం ఆటో ఎక్కాం. కళ్యాణ మంటపానికి బయలుదేరినాం.

"ఏమండీ పెళ్ళికి ముందురోజు నుంచే పెళ్ళికొడుకు, పెళ్ళికూతురును వొక్కపొద్దు వుండమంటారు కదండీ. ఎందుకో?"

"ఏమీ లేదు ఏవైనా తింటే సరిగా పెళ్ళి పీటలపైన కూచున్నపుడు కడుపు గడబిడ చేస్తాదేమోననీ, ఆ యిబ్బంది లేకుండా వుండేందుకే కడుపు ఖాళీగా వుంటే మేలు కదా అని చెప్తారు. సత్యనారాయణ వ్రతం చేసేప్పుడు కూడా యింతే, కథ వినేకి గంట పైన కుచ్చోల్ల కదా అన్నాను నవ్వుతూ.

పెళ్ళిపీటల పైన ఒకప్పుడు పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు సిగ్గుపడతా కుచ్చునే వాళ్ళు కదా, యిపుడు వాళ్లు మాట్లాడుకుంటుంటే పెళ్ళికి పోయిన మనం వాళ్ళను చూసేకి సిగ్గుపడతాండాం కదా' అనింది నవ్వుతూ.

"అంతేకదా! పెళ్ళి యింకా రెండు నెలలు వుందనంగానే ఎంగేజ్‌మెంట్, అప్పటి నుండి రెండు నెలలు ఫోన్లో మాట్లాడుకోవడమే. ఆ ఫోన్ బిల్లులతో పేదోల్ల పెళ్లిల్లు చేయొచ్చు.

సినిమా ఆడియో రిలీజ్, మల్లా వీడియో రిలీజ్ అయినట్ల" అన్నాను నవ్వుతూ.

"అయినా లక్షలు ఖర్చు పెట్టి ఎంగేజ్‌మెంట్ చేస్తారు కదా, ఆ రోజే తాళి కట్టేస్తే పెళ్ళి అయిపోతుంది కదా, ఎందుకు యింత దుబారా చేస్తారండీ".

"లెక్కలు ఎక్కువైనోల్లు చేసేదే అది. అట్ల చేస్తేనే బ్లాక్‌మనీ అంతా మార్కెట్లోకి వస్తుంది. పదిమందికి బతుకుతెరువు దొరుకుతుంది కదా, కానీ వాళ్ళు చేసినారని లేనోల్లు అప్పులు చేసి చెయ్యడం అవివేకం, పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లే" అన్నాను.

''మా కాలంలో పెళ్ళికూతురు కొత్తగా అత్తగారింటికి పోయేప్పుడు, పుట్టినింటోల్లందరినీ వదిలిపెట్టి పోతాండామని ఏడుస్తా పోతాంగ్రి, యిప్పుడు ఆ ఏడ్పులు లేవు కదా మరుసటి రోజే హ్యాపీగా అమెరికాకు పోతాండారు కదా" అనింది శాంత.

"అంతేకదా యిప్పుడు, కానీ అత్తమామలు ఏడుస్తాండారు యిన్నేండ్లు మనం కని పెంచిన కొడుకు యింక తమకు కనిపించడేమోనని, కోడలు హైజాక్ చేస్తాందని" అన్నాను నవ్వుతూ ఆ రోజుల్లో ఆడపాప పెళ్ళయ్యే వరకు పుట్టినింటిలోనే పెరిగేది. కానీ యిప్పుడు ఎల్కేజీ వయసులోనే యేదో హాస్టల్లో పడేస్తాండాం కదా. అపుడేడ్చింటారు కదా, అందుకే యిప్పుడు ఏడ్చడం లేదు.

"కరెక్ట్ మీరు చెప్పేది. పాతకాలములో మొగుళ్ళు పెళ్ళాలను 'యేయ్' అని పశువులను పిల్చినట్ల పిల్చేవాళ్ళు కదా, యిప్పుడు అమ్మాయిలు మొగుళ్ళను 'రేయ్' అంటాండారు కదా" అనింది నవ్వుతూ శాంత.

"అంతే లేచింది మహిళాలోకం, దద్దరిల్లింది పురుష ప్రపంచం" అన్నాను నవ్వుతూ.

"అది కాదండీ పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు జిలకరా బెల్లం తల పైన పెట్టుకొనేప్పుడు వాళ్ళు యిద్దరూ ఒకర్నొకరు కళ్ళల్లోకి చూసుకోవల్లంట, అట్ల చూసుకోకుండా ఫోటోగ్రాఫర్ పక్క తిరిగి ఫోజులు యిస్తాండారంట. దాని వల్లనే చాలా పెళ్లిల్లు పెటాకులైతాండాయని టీవీలో ఒక చాదస్తపు రావు చెప్పితే విన్నాను. అంతేనంటారా"

"అవంత వొట్టికూతలు. కలవాల్సింది వాళ్ళ లోచనలు (కళ్ళు) కాదు ఆలోచనలు. యిద్దరి ఆలోచనలు కలిస్తేనే కాపురం సాఫీగా సాగుతుంది. లేకపోతే అందం, ఆస్తులు ఎంత వున్నా విడాకులైతున్నాయనేది నేను లీగల్ కన్సిలియేటర్‌గా కోర్టులో చూస్తున్నా. అయినా యిప్పుడు పెళ్ళిలో పురోహితుడు కూడా ఫోటోగ్రాఫర్ చెప్పినట్ల వినాల్సిందే కదా" అన్నాను నవ్వుతూ.

"కాదండి తాళి కట్టేప్పుడు ఎందుకండీ బ్యాండ్, మేళం కళ్యాణమంటపం ఎత్తిపోయేట్ల, మన చెవులు పోటీప్లేట్ల వాంచుతారు" అన్నది కోపంగా?

"ఎందుకంటే సరిగ్గా తాళికట్టేప్పుడు ఎవరైనా తుమ్మితే అపశకునమనుకుంటారు కదా. అందుకే ఆ తుమ్ము వినపడకుండా గట్టిగా వాయించుతారు" అన్నాను నవ్వుతూ.

"అది సరే, మూడు బ్యాడ్ నంబరు అంటారు, తాళి కట్టేప్పుడు మూడు ముళ్ళే

వేయిస్తారు. ఏడు బ్యాడ్ నంబర్ అంటారు దంపతులను ఏడు అడుగులే నడిపిస్తారు ఎందుకో" అడిగింది నవ్వుతూ.

"నేను యిదే విషయం ఎంతో మంది స్వాములను అడుగుతాంటా. కాదు స్వామి మూడుముళ్ళ బదులు, రెండో, నాలుగో వేయించొచ్చుకదా, అట్లనే ఏడు అడుగుల బదులు ఆరో, ఎనిమిదో వేయించొచ్చు కదా అని కానీ ఎవ్వరూ సమాధానం లేకనో, నన్ను అధిక ప్రసంగి అనుకొనో మౌనంగా నవ్వుతాండారు" అన్నాను.

"ఏందో స్వాములు చెప్పినట్ల మనం చెయ్యాల్సిందే. చెయ్యకపోతే ఏమైతుందోననే భయం. అసలు మిట్ట మధ్యాహ్నం అరుంధతిని చూడమంటారు. కనపడలేదని చెప్పొద్దండి, కనపడిందని అబద్ధం చెప్పమంటే మనమూ చెప్పినాం కదా" అనింది నవ్వుతూ.

"అది అంతే, వాళ్ళు ఏం చెప్తే అది మనం చెయ్యాల్సిందే. నూతన దంపతులు తమ దాంపత్య జీవితములో మొదట చెప్పే అబద్ధం యిదే. యిక ముందు ముందు ఎన్ని అబద్ధాలయినా చెప్పడం అలవాటయితుంది కదా దీని వల్ల"

యిట్ల మాట్లాడుకుంటుండగానే కళ్యాణ మంటపం వచ్చింది.

కళ్యాణ మంటపము మెయిన్ గేట్ దగ్గరే మాకు ఆహ్వానం పలికిన పెళ్ళికొడుకును నా భార్యకు పరిచయం చేసి లోపలికి వెళ్ళాం.

అప్పటికే చాలా మంది కూచున్నారు నిశ్శబ్దంగా.

"ఏందండీ పెళ్ళికొడుకు మనతో పాటు పెళ్ళికొచ్చినట్లే వున్నాడు. లోపల ఏమీ పెళ్ళిసందడి లేదు. పెళ్ళంటే వేదిక డెకొరేషన్‌తోపాటు భాజాభజంత్రీలు ఏమీ లేకుండా ఏదో కమ్యూనిస్టు పార్టీ మీటింగ్‌కు వచ్చినట్లుందే, కనీసం మైకుంది ఏదో ఒక పాట పెట్టినా కొంచెం సందడి వుంటుంది కదా" అనింది శాంత.

"నేనూ అదే ఫీల్ అయితాండా" అంటుండంగానే 'వినుడు వినుడు రామాయణ గాధ' అనే పాట అందుకుంది మైకు.

"ఏందండీ కమ్యూనిస్టు పెళ్ళి అంటారు. యిట్లా పాట పెట్టినారు" అనింది ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ శాంత.

"ఔను యిదేదో నాకూ ఆశ్చర్యంగా వుంది. ఎన్నో విప్లవగీతాలు, అభ్యుదయ పాటలు వ్రాసిన కవులు యిట్లా పెళ్లి సందర్భానికి తగిన పాట ఒక్కటి రాయలేదా, అసలు ఎవడు పెట్టమన్నాడో ఈ పాట" అంటూ పైకి లేచాను ఆ పాట నిలిపేయమని చెప్పడానికి కోపంగా.

"ఊరకే కుచ్చోలేరా? ఎక్కడికి వచ్చినా యింతే మీరు. అందరూ వింటాండారు కదా. మీరు వింటే వినండి లేకపోతే చెవులు మూసుకొని కూచ్చోండి" అని ఆర్డర్ పాస్ చేసింది శాంత.

సరే అనుకొని నోరు మూసుకొని కూచ్చున్న కాసేపటికి 'అయోనిజ పై అనుమానమా… అడవికి పంపె సీతను…' అంటూ విషాదరాగంలో వినపడుతూంది పాట.

ఆ పాట వింటానే అరె శుభమా అని పెళ్ళి చేసుకుంటుంటే సీతను అడవికి పంపే అనే పాటనా పెట్టేది అనుకొని కోపాన్ని కంట్రోల్ చేసుకోలేక సీరియస్‌గా మైక్ దగ్గరకు పోయి "రేయ్ ఎవడురా ఈ పాట పెట్టమనిండేది" అన్నాను కోపంగా.

"నేనే పెట్టినాను సార్" అన్నాడు అమాయకంగా.

"ఆఫ్ చెయ్ వోయ్" అని ఆఫ్ చేయించి ఏదో ఘనకార్యం చేసినట్ల హీరోలా వచ్చేసినాను. మరీ హాల్ అంతా నిశ్శబ్దం అయింది.

ఆ పాట నిలిపేసిన కొంచెం సేపటికి మా పక్కనే కూచున్న ఒక ముసలామె "ఏందో బాగుండె. ఈయప్ప అది కూడా లేకుండా చేసినాడు" అనింది నావైపు కోపంగా చూస్తూ.

ఆమె మాట విన్న నేను, శాంత ఒకటే నవ్వుకున్నాం.

'అంతే కదండీ. కత్తి తెగుతుందని తెలీక కత్తితో ఆడుకునే పిల్లోన్ని కత్తి యివ్వమంటే యిస్తాడా. దాని బదులు ఏదో ఒక బొమ్మ యిచ్చి ఆ కత్తి యిమ్మంటే యిస్తాడు కదా, అట్లనే ఆ పాట వద్దన్నా వేరే ఏదో ఒక పాట పెట్టించల్ల కదా" అనింది నవ్వుతూ శాంత.

నేను కూడా అట్లే అనుకొని "రేయ్ దాని బదులు కనీసం' సీతారాముల కళ్యాణం చూతము రారండీ' అనేదో 'బంగారు బొమ్మ రావమ్మా' అనే పాట వుంటే పెట్టరా" అన్నాను.

"మరి అవి పెట్టలేదా?"

"నా దగ్గర అవేవీ లేవు సార్. యింకొకటి వుంది సార్ అది పెడతాను సార్" అన్నాడు.

"అదేంది రా?" అంటే "సత్యహరిశ్చంద్ర డ్రామాలో కాటిసీను పద్యాలున్నాయి సార్" అన్నాడు అమాయకంగా.

"యూజ్ లెస్ ఫెలో, యిదేం పెళ్ళి అనుకున్నావా. డ్రామా అనుకున్నావా. పెళ్ళిలో, శ్మశానంలో చెప్పే పద్యాలు ఎట్ల పెడతావ్ వోయ్, ఆఫ్ చెయ్" అని వచ్చేసినాను.

"భలే చెప్పినాడే, యింతకూ యిదంత పెళ్ళికొడుక్కు తెలీదు కదా" అనింది నవ్వుతూ.

"ఎట్ల తెలుస్తుంది. అతను బయటనే వున్నాడు కదా" అన్నాను.

తర్వాత కొద్దిసేపటికి దండలు మార్చుకోవడంతో పెళ్ళి జరిగింది. వెంటనే ఒక నాయకుడు మైక్ తీసుకున్నాడు. 'కామ్రేడ్' అంటానే మేం కామ్‌గా యింటికి బయలుదేరినాం.

⌘

03.06.2006

వాకిటికి ఎదురుగా ఈజీ చెయిర్లో పేపరు చదువుతూ మా మరిది ఆనందరావు కనిపించాడు. నన్ను చూడగానే దిగ్గున ఆశ్చర్యంగా నవ్వుతూ ఈజీ చైర్లోంచి లేస్తూ "అన్నయ్యేడి వదినా?" అంటూ కుశల ప్రశ్నలు వేస్తున్నాడు. నేను ఒక్క ప్రశ్నకు కూడా సమాధానమివ్వడం లేదు. నా కళ్ళని నేను నమ్మలేకపోతున్నాను. 'ఢిల్లీ నుంచి ఎప్పుడు వచ్చాడు ఆనందరావు? ఇప్పుడు ఇంట్లోకెలా వచ్చాడు?' అని ఆలోచిస్తూ ఉన్నాను.

"నువ్వు వచ్చేటప్పటికి తలుపు బార్లా తెరిచి ఉందాయ్యా?" అడిగేను ఆనందరావుని.

"ఎందుకొదినా! అలా అడుగుతున్నావు? నేనే తీశాను తలుపుల్ని".

"మరి తాళంచెవీ?"

"తులసికోటలో వదినా!"

"ఆ... అది అక్కడ ఉన్నదని నీకెలా తెలుసు?"

"ఎలాగంటే ఏం లేదు వదినా! నిజానికి నాకేం తెలీదు. తెల్లవారే ఇక్కడికి వచ్చాను. మీరిద్దరూ ఎక్కడికి వెళ్ళారో ఈ చుట్టుపక్కల వాళ్ళెవరూ చెప్పలేకపోయారు. ఏ లాడ్జింగుకయినా వెళ్దామా అని ఆలోచిస్తూ ఉండగా... ఇంట్లోకి వెళ్తారా?" అని అడిగారు ఇరుగుపొరుగువాళ్ళు.

"ఎవరూ?"

"ఒకరేమిటి, ఎదురింటాళ్ళూ, పక్కింటాళ్లూ... సరేనన్నాను.

"ఆ తులసికోటలో తాళంచెవి ఉంటుంది. మొక్కి మరీ తీసుకోండి" అన్నారు. నేను అలాగే తీసుకున్నాను. అయినా చుట్టుపక్కల అందరికీ తెలిసేట్లు పెట్టడం ఏం పద్ధతి వదినా?" అని అడుగుతున్నాడు మా మరిది.

మా చుట్టుపక్కలవాళ్లని దొంగలుగా అనుమానించినందుకు సిగ్గుపడ్డాను. రోజూ వాళ్ళు చూస్తూ ఉండగా తులశమ్మకు ఆపద్ధర్మ పూజలు చేస్తుండటం కళ్ళ ముందు మెదులుతుంటే అవాక్కయిపోయాను.

⌘

ఆంధ్రప్రభ, ఆదివారం అనుబంధం - 04.02.1996

300 పేజీలు 43 కథలు గల ఈ **రాయలసీమ హాస్య కథలు** పుస్తకం వెల 280. కావలసిన వారు సంప్రదించండి.

డా॥ ఎం. హరికిషన్ - 94410 32212

1.రాయలసీమ రచయిత్రుల కథలు - 300/-

2.రాయలసీమ కరువు కథలు - 400/-

3.రాయలసీమ ప్రేమ కథలు - 200/-

4.కర్నూలు కథ - 400/-

5.తెలుగువారి జానపద కథలు - 400/-


6.హరికిషన్ కథలు - 300/-

సంపాదకత్వం
డా॥ ఎం. హరికిషన్
94410 32212


కథా సంకలనం


రాయలసీమ హాస్య కథలు
















దీప్తి ప్రచురణలు
మ్యూజియంరోడ్, విజయవాడ-520 002